క్లుప్తంగా

పంట నమోదు వేగవంతం చేయండి



వ్యవసాయ అధికారిణి సరిత

నందవరం: పంట నమోదు వేగవంతంగా పూర్తి చేయాలని వీఏఏలు, వీహెచ్ఏలకు మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..మండలంలో 54,963 ఎకరాలు సాగు భూమి ఉండగా ఇప్పటి వరకు 27,284 ఎకరాలు క్రాప్ బుకింగ్ పూర్తి చేశామని వివరించారు. రైతులు సాగు చేసిన పంటలకు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. క్రాప్ బుకింగ్‌కు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందన్నారు. క్రాప్ బుకింగ్‌తోనే సంక్షేమ పథకాలకు అర్హుల వుతారని ఏఓ వివరించారు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

ఆదోని టౌన్: క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సైక్రియాటిస్ట్ చైతన్య కుమార్, వెంకటసుబ్బయ్య, సైకాలజిస్ట్ పుల్లమ్‌రాజు సూచించారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక నోబుల్ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అబ్దుల్‌బాషా అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు అనేక దుష్ప్రభావాలకు దారి తీస్తాయన్నారు. మానసిక రుగ్మతలకు గురికాకుండా ఉల్లాసంగా, ఆనందంగా అందరిలో కలిసిమెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దినాకర్, సౌజన్య, స్రవంతి, ప్రీతి, సోని విరుపాక్షి, డా.సలోమీ, ప్రవీణ్‌కుమార్, సుధాకర్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కూలిన తన ఇంటిని చూపుతున్న బాధితుడు కురువ తిక్కయ్య

పెద్దకడబూరు: చిన్నతుంబళం గ్రామంలో కురువ తిక్కయ్యకు చెందిన మట్టిమిద్దె గురువారం రాత్రి పెద్ద శబ్దంతో కూలిపోయింది. ఈ సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. ఇళ్లు కూలిపోయే సమయంలో కురువ తిక్కయ్య తన భార్య, ఇద్దరు పిల్లలు ఆ ఇంట్లోనే పడుకున్నారు. వారి అదృష్టం మేరకు ఇళ్లు మరోపక్క కూలిపోవడంతో అందరూ ప్రాణాలతో భయటపడ్డారు. కొంచెం ఇటు పక్క పడి ఉంటే తమ అందరి ప్రాణాలు పోయేవని బాధితుడు కురువ తిక్కయ్య భయాందోళన వ్యక్తం చేశారు.

క్రీడా పోటీల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థినులతో స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీన్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మౌంట్ కార్మెల్ స్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచారు. ఇందులో 400 మీటర్ల పరుగు పందెంలో ఇ.అమృత, ఎం.అమృత, జయమ్మ, రాధిక, లాంగ్ జంప్‌లో ఎం. అమృత, షార్ట్ పుట్, డిస్క్ త్రోబాల్‌లో స్వేత, రాధిక, 600 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి, హేమావతి, 400 మీటర్ల రిలే గేమ్‌లో రాజేశ్వరి, వైష్ణవి, హేమావతి, శృతిహాసిని ప్రతిభ కనపరిచినట్లు స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీన్ తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్డుకు మరమ్మతులు



సాతనూరు గ్రామంలో కంకర గరుసుతో గుంతలు పూడ్చిన దృశ్యం

కోసిగి: సాతనూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలమయమైన ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టారు. శిథిలమైన రహదారి గురించి ప్రజలు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి గ్రామ వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుల చేత ట్రాక్టర్‌లతో సిమెంట్ గ్రావెల్ వేయించి గుంతలను తాత్కాలికంగా పూడ్చించారు. దీంతో గ్రామ ప్రజలు, ఆటో డ్రైవర్స్ ఆనందం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి కుట్రను తిప్పికొడదాం



'కోటి సంతకాల ప్రజా ఉద్యమ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు వైద్యాన్ని దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పన్నిన కుట్రను తిప్పికొడదామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలల పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్లను పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మురహరిరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసితో ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎంతో ఉన్నతాశయంతో మాజీ సీఎం జగనన్న రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టి ఏడింటిని పూర్తి చేసి వైద్య విద్యను అందుబాటులో తెచ్చారన్నారు. మిగిలిన కళాశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. వాటిని ప్రైవేటు పరం చేసేందుకు పీపీపీ పద్ధతిపై 66 సంవత్సరాల పాటు కట్టబెట్టేందుకు ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. ప్రజల ఆస్తులు ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వ తీరు పట్ల తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల పరిరక్షణకు వచ్చే నెలాఖరు వరకు వివిధ రూపాల్లో ధర్నాలు, నిరసనలతో పాటు కోటి సంతకాలు సేకరిస్తామన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, కామర్తినాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ నాయకులు సునీల్‌కుమార్, రామకోటిరెడ్డి, విరూపాక్షిరెడ్డి, బోయ బజారి, శివప్రసాద్, బజారిరెడ్డి, కోటకొండ నరసింహులు, చేనేత మల్లికార్జున, మధుబాబు, ముల్లా రసూల్, డిష్ కేశవరెడ్డి, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, పాల శ్రీనివాసరెడ్డి, రాజు, ఫయాజ్, అల్తాఫ్, ఇబ్రహీం, మాబాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు వై. సీతారామిరెడ్డి

మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేస్తే ఉద్యమిస్తాం

మంత్రాలయం రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేయాలని చూస్తే ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యానిర్వాహక సభ్యులు వై. సీతారామిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేసే ఆలోచన ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పోరాటాలు విస్తృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఈనెల 10వ తేదీ నుంచి నవబంర్ 22వ తేదీ వరకు గ్రామ గ్రామాల తిరిగి కోటి సంతకాలు సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, దశరథ రెడ్డి మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

'కోటి సంతకాల ప్రజా ఉద్యమం'లో భాగస్వాములవ్వాలి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, చైర్‌పర్సన్ లోకేశ్వరి తదితరులు

ఆదోని టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, పట్టణ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో ప్రజల హక్కులను కబళించే విధానాలను అనుసరిస్తుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ పోరాటంలో ప్రతి విద్యార్థి, కార్మికుడు, ప్రజలు భాగస్వాములై ముందడుగు వేయాలన్నారు. ఈనెల 10వ తేదీన ప్రతి జిల్లాలో రచ్చబండ, సంతకాల సేకరణ ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, వచ్చే నెల నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు, 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు ప్రజా ప్రదర్శన, 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలింపు, డిసెంబర్ 5న కోటి సంతకాల ప్రజా ఆందోళనకు మహా సమాప్తి సభ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతూ విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫయాజ్‌అహ్మద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఉలిద్రపసోట్, జిల్లా కార్యదర్శి రామలింగేశ్వరయాదవ్, సునార్ ఖాదర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వై.పి.గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్లు చలపతి, అశోక్, గోవిందు, గురునాథ్ రెడ్డి, నల్లారెడ్డి, దినేష్, సునాగ్, మహిళా నాయకులు జులేఖ బి, శ్రీలక్ష్మి, శ్రీదేవి, సుగుణ మ్మ, శోభలత, సౌమ్యరెడ్డి, వలంటరీ అధ్యక్షులు ప్రణయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ సాధన కమిటీ సభ్యులు, విద్యార్థులు

ఆదోని రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటు అని మెడికల్ సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వం వెంటనే నిర్మించాలని మెడికల్ కళాశాల సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ప్రదర్శన చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు దేశెట్టి ప్రకాష్, శబరి బాష, కో కన్వీనర్ దస్తగిరి, అఖండ, సోమశేఖర్, తిరుమలేష్, బాలు, రమేష్, శ్రీనాథ్, వెంకటేశులు మాట్లాడుతూ ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో అందరూ కలిసికట్టుగా పోరాటం చేస్తామన్నారు. వెంటనే మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విదయను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్, ఉమాకాంతక్ష, శశి, అరుణ్, రుఆజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వాహనం డీజిల్ విక్రయం

- ఇద్దరు డ్రైవర్లను పట్టుకున్న కర్నూలు విజిలెన్స్ అధికారులు

యాడికి: మండలంలోని వేములపాడు సమీపంలో లేబై వద్ద కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన లాజిస్టిక్ వాహనం నుంచి అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న ఇద్దరు డ్రైవర్లను ఆ జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి కడపకు బయల్దేరిన ఆర్టీసీ లాజిస్టిక్ వాహనం శుక్రవారం తెల్లవారుజామున వేములపాడు వద్దకు చేరుకుంది. లేబై వద్ద వాహనాన్ని డ్రైవర్ ఆపి ట్యాంక్ నుంచి 20 లీటర్ల క్యాన్‌లోకి డీజిల్ తీస్తుండగా వెనుకనే అనుసరిస్తూ వచ్చిన కర్నూలు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ శామ్యూల్‌తో పాటు కార్మికుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని యాడికి పీఎస్‌లో అప్పగించారు. కొంత కాలంగా ఈ తంతు కొనసాగుతోందని, విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

- జడ్జి ఎం.ఎల్.సాయిసుభాష్



మాట్లాడుతున్న ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎల్.సాయిసుభాష్

ఆదోని రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎల్.సాయిసుభాష్ సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని డీఈఐసీలో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల దృష్టి సారించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. చిన్నచిన్న విషయాలకు మానసికంగా కుంగిపోరాదన్నారు. ధైర్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఉంటే సైకాలజిస్టులను సంప్రదించి కౌన్సెలింగ్ తీసుకోవలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై శ్రద్ధ పెట్టి వారి సమస్యలను పరిష్కరించాలని, పిల్లల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సూపరింటెండెంట్ డా.నాగరాజు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ పద్మాకర్, సైకాలజిస్ట్ పుల్లం రాజు, డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 36 మంది ఎంపిక

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆల్‌డీజీ టెక్నాలజీ వారు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 36 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చెన్నై క్యాంపస్‌కు 24 మంది, బెంగళూరు క్యాంపస్‌కు 12 మందిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమములో విశ్రాంత ప్రిన్సిపాల్ సురేష్ ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణ, వన్నూర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- తిరుమలనగర్ వాసుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న తిరుమల నగర్‌వాసులు

ఎమ్మిగనూరుటౌన్: భారీ వర్షానికి స్థానిక తిరుమల నగర్ పూర్తిగా జలమయమైనా అధికారులు పట్టించుకోవడం లేదంటూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయాన్ని ఆ ప్రాంత వాసులు ముట్టడించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తాము ఇళ్ల నుంచి బయటికి అడుగు పెట్టలేని విధంగా వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నా సమస్యను పరిష్కరించకుండా అధికారులు కొన్నేళ్ల నుంచి కాలయాపన చేస్తున్నారంటూ మండిపడ్డారు. కార్యాలయంలోకి వెళ్లి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. ప్రధాన రహదారుల్లోని డ్రైన్ల స్థలాలు కబ్జాకు గురికావడంతో వర్షం వచ్చిన ప్రతి సారి దారుల్లేక ఇబ్బందులు పడుతున్నామని సత్వరం సమస్య పరిష్కరించాలంటూ వారు పట్టుపట్టారు. కమిషనర్ డ్రైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టామని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఆయన వెళ్తున్న వాహనం ముందు బైఠాయించారు. చివరికి పోలీసులు వచ్చి వారిని సముదాయించినా వినలేదు. సమస్యను వెంటనే పరిష్కరించి తగిన చర్యలు తీసుకొని పనులు ప్రారంభిస్తామని కమిషనర్ చెప్పడంతో వారు శాంతించారు.

పొలంలో పత్తి అపహరణ

కోసిగి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడిని దొంగలు దోచుకెళ్లారు. ఈ మేరకు కోసిగికు చెందిన నాగన్న గేరి కోసిగయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతు కోసిగయ్య దేవర బెట్ట పొలాల్లో ఎకరన్నరలో పత్తి సాగు చేశాడు. పంట కోతకు రాగా కూలీల కొరతతో పత్తి తీయలేదు. ఇది అదునుగా తీసుకుని గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు పొలాన్ని ఖాళీ చేశారు. శుక్రవారం ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా ఖాళీ చెట్లు తప్పా పత్తి కనపించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగలను పట్టుకోవాలని కోరాడు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే ఓ ఉన్నతమైన లక్ష్యంతో చదువును కొనసాగించాలని ఫిజికల్ మోటివేటర్ రవి అన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ శాంతి అధ్యక్షతన జరిగిన సైకాలజీ మోటివేషన్‌లో భాగంగా కేరీర్ గైడెన్స్‌పై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య అనేది మన జీవితానికి ఒక పునాదిలాంటిది అన్నారు. ఇక్కడ మనం ఉన్నతమైన ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి



అమాన్‌బాషా (ఫైల్)

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అమాన్‌బాషా శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణాధ్యక్షుడు బి.దేవా, నాయకులు బాధితా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమాన్‌బాషా పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు.

తల్లిపాలలో పోషక విలువలు

ఎమ్మిగనూరుటౌన్: తల్లిపాలలో అనేక పోషక విలువలుంటాయని అంగన్‌వాడీ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని గంజిళ్ల రోడ్‌లోని 57వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాహ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఐవైసీఏఫ్‌పై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, తల్లిదండ్రుల భాగస్వామ్యం తదితర అంశాలపై వివరించారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బసవరాజుపై విద్యార్థి తండ్రి దాడి చేయడం అమానుషమని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు గంగాధర్, నరసింహులు చెప్పారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు బోధనతో పాటు మంచి క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయులు మందలిస్తుంటారని, దానికే ఉపాధ్యాయులపై దాడి చేయడం సరైంది కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్యాధికారుల సమస్యలు పరిష్కరించాలి



నందవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నందవరం: ప్రభుత్వ వైద్యాధికారుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పీహెచ్‌సీ వైద్యులు బలరాముడు, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, మరియమ్మ, సుశీలబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులకు మద్దతుగా ఆసుపత్రి సిబ్బంది నిరసన చేపట్టారు. 15 రోజుల నుంచి ప్రభుత్వ వైద్యుల సమ్మె కారణంగా 104 సేవలు, పీహెచ్‌సీలో వైద్య సేవలు నిలిచిపోయాయ్యన్నారు. గ్రామాల్లో సరైన వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిరసనలో కమ్యూనిటీ హెల్త్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో విద్యార్థులకు నష్టం



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు



ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

గోనెగండ్ల: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువ నిర్వహించడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమై నష్టపోతున్నారని ఫ్యాప్టో నాయకులు గంగాధర్, కిషోర్, బాబు, రహంతుల్లా, నరసింహులు, మౌలాలి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ నీలకంఠకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పి ఇప్పుడు ఒక్క యాప్‌లోనే 100పైగా యాప్‌లను చేర్చి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. దీంతో విద్యార్థులకు విద్యను పూర్తిగా దూరం చేస్తుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో సంఘం పిలుపు మేరకు శుక్రవారం నుంచి అన్ని రకాల యాప్‌లను బాయ్‌కాట్ చేస్తూ కేవలం పాఠశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే టీచర్స్, విద్యార్థులకు అటెండెన్స్, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన యాప్‌లను తప్ప ఏ యాప్‌లను పాఠశాల సమయంలో ఉపయోగించమన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ పాఠశాలలను కాపాడటానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు అక్బర్, మౌలాలి, నాగరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరణ

ఆదోని సెంట్రల్: బోధనేతర కార్యక్రమాలతో విద్యా బోధన కుంటుపడుతుండటంతో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు నాగరాజు, వీరచంద్ర యాదవ్, లింగప్ప, మహాదేవప్ప, శ్రీనివాసులు, సుంకన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి, మండల విద్యాధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులను కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోజు రోజుకు బోధనేతర పనులు మితిమీరి పోతున్నాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించలేకపోతున్నామన్నారు. యాప్ల నిర్వహణ, ఆన్‌లైన్ల పనులతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు వారు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు చేయాల్సిన పనులను తమతో చేయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సుధాకర్, ముత్తన్న , రామకృష్ణ, నాగేంద్ర, మల్లికార్జున, సూర్యుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రెండేళ్ల జైలు

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి ఆదోని కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఆదోని పట్టణంలోని ఏపీ హెచ్‌బీ కాలనీకి చెందిన కె.గోపీకృష్ణ 2017 నంబర్ 22వ తేదీన ఆదోని-ఎమ్మిగనూరు రహదారిలో రాజానగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ కేసులో జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన ఎస్.హుస్సేన్‌సాహెబ్ ప్రమాదానికి కారణమని మృతుడు భార్య అంజనా దేవి ఆదోని తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్.హుసేన్‌సాహెబ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. 8 ఏళ్ల పాటు సాగిన కోర్టు వాయిదాల అనంతరం శుక్రవారం జడ్జి లీలాసాయి సుభాష్ నిందితుడికి జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

నూతన జీఎస్టీ ప్రయోజనకరం



ఎంపీడీఓ కార్యాలయంలో ప్రదర్శనగా ఉంచిన ఎలక్ట్రానిక్ వస్తువులు

గోనెగండ్ల: కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన జీఎస్టీ విధానం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రదర్శనలో ఉంచి కార్యాలయానికి వచ్చిన ప్రజలకు జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుత జీఎస్టీ నూతన స్లాబులను గుర్తించి చెల్లింపుల్లో ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే 2.0లో తీసుకువచ్చిన సంస్కరణలను, జీఎస్టీని విభజించిన తీరును వివరించారు. ఆయా షాపుల యాజమానులు కూడా కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.